# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రహదారులు, భవనాల శాఖపై ఈరోజు అమరావతిలోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల16వ తేదీన తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.
- రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి కోసం అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.
- చిత్తూరు జిల్లాలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మరణించారు.
- వరద నష్టం అంచనాలు పూర్తి కాగానే బాధితులకు పరిహారం అందిస్తామనిమంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

===========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రహదారులు, భవనాల శాఖపై ఈరోజు అమరావతిలోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టం అంచనాపై అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకోని వరద బాధితులకు సహాయంలో భాగంగా బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ ఏజెన్సీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఛత్తీస్ఘర్ లోని దుర్గ్ నుండి విశాఖపట్టణం మధ్య, నాగ్‌పూర్ నుండి హైదరాబాద్

మధ్య రెండు వందే భారత్ రైళ్లు మంజూరు అయ్యాయని మంత్రి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆపన్న హస్తం అందించారని కేంద్రమంత్రి తెలిపారు. 70 సంవత్సరాలు దాటిన వారందరికీ 5 లక్షల రూపాయల వరకు ఆరోగ్య బీమా కల్పించారు. పేద, ధనిక తేడా లేకుండా 6 కోట్ల మంది వయోవృద్ధులకు ఈ లబ్ధి చేకూరనుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

==========================

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి కోసం అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులో వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవ కరపత్రాలు గోడ పత్రాలను మంత్రి ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటగిరి అమ్మవారి జాతర మహోత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు. జాతరను అత్యంత వేడుకగా నిర్వహించేందుకు కోటి రూపాయల నిధులను కూడా మంజూరు చేస్తామన్నారు. ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకూ జాతర జరుగుతుందని.. భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలియజేశారు.

==========================

దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలోని విజయవాడ రైల్వేస్టేషన్ అరుదైన గుర్తింపును దక్కించుకుంది. దేశంలో ఏ రైల్వే స్టేషన్ అయినా ఒక సంవత్సరంలో 500 కోట్ల రూపాయలకు పైగా ఆదాయాన్ని సాధించినా లేదా 20 మిలియన్ల మంది ప్రయాణికుల రాకపోకలకు వేదికగా ఉన్నా అత్యంత ప్రతిష్ఠాత్మక NSG-1 కేటగిరీలోకి చేరుతుంది. 2023-2024 రైల్వే బోర్డ్ తాజా సమీక్షలో విజయవాడ రైల్వే స్టేషన్ అత్యధికంగా 528 కోట్ల రూపాయల వార్షిక ఆదాయం, 16.8 మిలియన్ ప్రయాణికుల కలిగి ఉండటంతో రైల్వే శాఖ NSG -1 హోదా ప్రకటించింది. విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ మాట్లాడుతూ... వాణిజ్య పరంగా విజయవాడ డివిజన్ అభివృద్ధి చెందుతోందని, ప్రయాణికుల అవరసరాల మేరకు ఇంకా మెరుగైన సౌకర్యాలు అందిస్తామని వెల్లడిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

==========================

చిత్తూరు జిల్లాలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మరణించారు. చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్ వద్ద ఆర్టీసీ బస్సు రెండు లారీలను ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 30 మందికి తీవ్రగాయాలయ్యాయి. మృతులు పలమనేరు, చిత్తూరు, వి.కోటకు చెందిన వారిగా అధికారులు గుర్తించారు. క్షతగాత్రులను తిరుపతి రుయాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈనెల 18వ తేదీన జరగనుంది. అమరావతిలోని సచివాలయంలో ఉదయం 11 గంటలకు మంత్రి మండలి సమావేశం కానుంది. ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం అన్నిశాఖలకు ఆదేశాలు జారీ చేసింది.

విరామం

==========================

దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని... వీటి ప్రభావంతో రాష్ట్రంలోని రానున్న రెండు రోజులు పాటు రాష్ట్రంలోని తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని

అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

===========================

వరద నష్టం అంచనాలు పూర్తి కాగానే బాధితులకు పరిహారం అందిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. విజయవాడలోని సింగ్ నగర్ లో ఈ రోజు మంత్రి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన పలు డివిజన్లలోని సుమారు 3 వేల 500 కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వరదలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని, ఇందుకు సంబంధించి వరద నష్టం అంచనాకు కూడా ప్రత్యేక బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టరేట్ లో ఉంటూ.. మంత్రులను, అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ.. బాధితులకు అండగా నిలిచారని అన్నారు.

===========================

గిరి ఆరోగ్య కేంద్రాల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఈరోజు ఆయన సాలూరు మండలం గిరిజన గ్రామమైన కారడవలసలో పర్యటించారు. గ్రామంలో గిరి ఆరోగ్య కేంద్రం, కంటైనర్ హెల్త్ సెంటర్ ను సందర్శించారు. గర్భిణీ స్త్రీలను ప్రసవ సమయానికి ముందుగానే గర్భిణీ వసతి గృహాలలో చేర్చాలని వైద్యాధికారులకు ఈ సందర్భంగా సూచించారు. మాతృత్వ మరణాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నూరు శాతం ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు, గర్భిణిలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

===========================

మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) వెబ్ సైట్ ను పరిశీలించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఈరోజు ఐటిడిఏ కార్యాలయంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి. అభిషేక్ తో కలిసి మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి, అర్జీదారుల నుండి 89 వినతి పత్రాలను స్వీకరించారు. ప్రతీ రోజు అధికారులు ఉదయం, సాయంత్రం పి.జి.ఆర్.ఎస్. వెబ్ సైట్ ను సందర్శించి ఫిర్యాదులను పరిశీలించాలని ఆదేశించారు.

===========================

పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి బ్యాంకులు సహకారం అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో ప్రత్యేక డిస్ట్రిక్ట్ కో- ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వరుసగా కురిసిన వర్షాల కారణంగా జిల్లా ప్రజలకు, రైతాంగానికి కలిగిన నష్టాలను వివరించారు. పంటలు నష్టపోయిన రైతులకు బ్యాంకులు రుణాలు అందించి ఆదుకోవాలని సూచించారు. రహదారుల భవనాల శాఖ రోడ్లు 30 కిలో మీటర్ల మేరకు నష్టం వాటిల్లిందని, 37 కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులకు, నిర్మాణాలకు 450 కోట్ల రూపాయల మేరకు అవసరమవు తుందని అన్నారు.

===========================

జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి కోరారు. ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం మన్యం

జిల్లాల్లోని అన్ని కోర్టుల్లోనూ ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్ కేసులకు ఇరు పక్షాల అనుమతితో రాజీమార్గంలో శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

============================

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ - గ్రీన్ బిజినెస్ సెంటర్ (CII-GBC) నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డును RINL - విశాఖ ఉక్కు కర్మాగారం వరుసగా 6వ సంవత్సరం దక్కించుకుంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, కార్పొరేట్ సంస్థ అయిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (RINL), (CII-GBC) నుండి ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డును పొందడం ద్వారా ఇంధన సామర్థ్యం పరిరక్షణలో మరోసారి గొప్ప ప్రమాణాన్ని నెలకొల్పింది.

============================

============================